యథేచ్ఛగా తవ్వకాలు.. పట్టించుకోని అధికారులు

- కూటమి నేతలకు ముడుపులు అందిస్తున్న మట్టి మాఫియా
- పంట పొలాలను చెరువులుగా మారుస్తున్న వైనం
- మట్టి ధరలకు రెక్కలు

రేపల్లె రూరల్: తవ్వుకో... దోచుకో... దాచుకో అన్న చందాన కూటమి నేతలు బరితెగిస్తున్నారు. టీడీపీ నాయకుల భూ దాహం రైతుల పాలిట శాపంలా మారింది. అక్రమార్జనే ధ్యేయంగా పంట పొలాల్లో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు జరిపి జేబులు నింపుకుంటున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకా అయిన రేపల్లె నియోజకవర్గంలో కూటమి నేతలు అక్రమార్జనకు బరితెగించారు. నియోజకవర్గంలోని నగరం మండలంలో కూటమి నేతలు మట్టి మాఫియాగా అవతారమెత్తి ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పంట పొలాలను చెరువులుగా తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి అమ్మకం కోసం సుమారు 15 నుంచి 20 అడుగుల మేర తవ్వుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మాఫియాకు కూటమి నేతల అండ

మండలంలోని పూడివాడ, సిరిపూడి, పెదమట్లపూడి గ్రామాల్లో మట్టి దందా జోరుగా సాగుతుంది. ఆయా గ్రామాల్లో సుమారు 10 ఎకరాల వరకు పంట భూములను చెరువులుగా తవ్వుతూ పంట పొలాలను నాశనం చేస్తున్నారు. మట్టి మాఫియాకు కూటమి నేతల అండ దండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు ఆ వైపు వెళ్లడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కారణం మట్టి మాఫియా భారీ స్థాయిలో ఇటు నేతలు, అటు అధికారులకు ముడుపులు ఇస్తున్నారని పలువురు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఎకరం పొలం మట్టిని తవ్వుకునేందుకు నియోజకవర్గంలోని ముఖ్య నేతకు రూ.3 లక్షల వరకు ముట్ట జెప్పాలని లేకపోతే తవ్వకాలు నిలిచిపోతాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.


సిరిపూడి గ్రామంలోని పొలాల్లో మట్టి తవ్వుతున్న దృశ్యం

పెరిగిన మట్టి రేట్లు

కూటమి నేతలకు భారీగా ముడుపులు అందిస్తుండటంతో మట్టి ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ట్రక్కు మట్టి రూ.1,000 ఉండేది. ప్రస్తుతం రూ.1,500 నుంచి రూ.2,000 వరకు వసూలు చేస్తుండంతో ఇళ్లు నిర్మించుకునేవారు ఆందోళన చెందుతున్నారు. లారీని ఏకంగా రూ.15,000కు విక్రయిస్తున్నారు. మట్టి ధరలను ఇష్టానుసారం పెంచుతున్నారని తప్పనిసరి పరిస్థితుల్లో కొనుక్కోవాల్సి వస్తుందని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియా ఆగడాలను అరికట్టి ధరలు తగ్గేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పంట పొలాలకు ముప్పు

ఇష్టానుసారం పంట పొలాలను చెరువులుగా తవ్వి సొమ్ము చేసుకుంటుండటంతో సమీపంలోని పంట పొలాలకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా కూటమి నేతల అండదండలతో చేస్తున్న తవ్వకాలతో పంట పొలాలు చెరువులుగా మారటంతో పాటు సమీపంలోని సిరులు పండించే పంట భూములకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలు నిలుపుదల చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



నగరం మండలంలో కొన్ని గ్రామాల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తహసీల్దార్‌ను అప్రమత్తం చేసి ఘటన స్థలానికి పంపాం. ప్రస్తుతం మట్టి తవ్వకాలు జరగటం లేదని నివేదిక అందించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక అందించాలని ఆదేశించాం. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినట్లు తేలితే బాధ్యులపై చర్యలు చేపడతాం.

– నేలపు రామలక్ష్మి, ఆర్డీవో, రేపల్లె

ఘనంగా బూరుగలమ్మ అమ్మవారికి సారె సమర్పణ


అమ్మవారికి సారెను ఊరేగింపుగా సమర్పిస్తున్న భక్తులు


అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారికి శుక్రవారం ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో నెల సంబర మహోత్సవాలు, సారె సమర్పణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అమ్మవారికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేశారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో నెలకొల్పి అంకమ్మ చెట్టు వద్ద నుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పురవీధుల్లో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి సారెను తీసుకువచ్చారు. చద్ది నైవేద్యాలతో పాటు పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, మిఠాయిలు, నూతన వస్త్రాలు, వడిగంటి బియ్యంతో కూడిన సారెను అమ్మవారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం

నిజాంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా గ్రామీణ ప్రాంతంలో పీఎంఏవై గ్రామీణ్ 1.0 పథకంలో మంజూరై ఇంకా పూర్తికాకుండా వివిధ దశల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీలకు చెందిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకమునకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1,80,000 యూనిట్ కాస్ట్‌కు అదనంగా 2024 డిసెంబరు 10 నుంచి అసంపూర్తిగా ఉన్న ఎస్సీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి

ధర్మ నిధి సేకరణలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ

భట్టిప్రోలు: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి, హోలీ పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా బాపట్ల జిల్లా పరిధిలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని దేవాలయాల్లో సామూహిక హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ మాట్లాడుతూ రాక్షస సంహారం జరిగిన సందర్భంగా హోలీ పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మ నిధి సేకరణ గావించిన రూ.50 వేలు నగదును ఎస్ఎస్ఎఫ్ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ధర్మ నిధి సేకరణలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జనం హేమశంకరరావు, మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, నిర్వాహకులు చింతల మురళీకృష్ణ, పడమట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయా దేవాలయాల పరిధిలోని పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.


ధర్మ నిధిని సేకరణలో బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ

వైభవంగా బేతపూడమ్మ అమ్మవారి తిరునాళ్ల

రేపల్లె రూరల్: మండలంలోని బేతపూడి గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత బేతపూడమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతకు భక్తులు స్వయంగా పసుపు, కుంకుమలు సమర్పించి ఆలయ ఆవరణలోని రావిచెట్టు వద్ద దీపారాధనలు చేసి చద్ది నైవేద్యాలు సమర్పించారు. అదేవిధంగా ఆలయ ఆవరణలోని నాగేంద్రస్వామికి ఆవుపాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయం వద్ద ప్రభలను నెలకొల్పారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బొమ్మల స్టాల్స్ ప్రజలతో కళకళలాడాయి. ఉయ్యూరువారిపాలెం, తురకపాలెం, ఇసుకపల్లి గ్రామాల నుంచి తరలి వచ్చిన భారీ ప్రభలతో పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


పూజలందుకుంటున్న బేతపూడమ్మ


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ఆశీలు వేలం వాయిదా

రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపాలిటీలో 2025–26 సంవత్సరానికి కూరగాయల మార్కెట్, రోడ్డు మార్జిన్, కబేళ, విక్టోరియా సత్రంకు సంబంధించిన మూడు పొలములు, మార్కెట్ ఆశీలులకు సంబంధించి ఆశీలు వసూలు చేసుకునేందుకు ఈ నెల 17వ తేదీన నిర్వహించే వేలం పాటను పరిపాలన పరమైన కారణాల నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటించటం జరుగుతుందని పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్

భట్టిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాలలో పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీలు, సొంత స్థలాల్లో 2019–24 మధ్య మంజూరైన గృహాలను మే నెల లోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం అందించిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోక చాలామంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోలేదని తెలిపారు. ఇప్పుడు వీటికి అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందచేయడం జరుగుతుందన్నారు. అలాగే డ్వాక్రా సభ్యులకు సున్నా వడ్డీతో రూ.35 వేలు రుణం, ఉచిత ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించి లక్ష్యాలను పూర్తి చేసేలా పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, హౌసింగ్ ఏఈ సౌమ్య, ఏపీవో పార్వతి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్

ఉన్నత స్థాయి అధికారులు ఉన్న ఊళ్లో సమస్యలు

బాపట్ల: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు చేసి రిటైర్డు అధికారులుగా ఉన్న బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామం తాగునీటి సమస్యతో తల్లడిల్లుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం పార్టీ గ్రామంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో అనేక సమస్యలను ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. జిల్లా కేంద్రమైన బాపట్లకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా అధికారం చెలాయించిన రిటైర్డు ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన అధికారులు ఎందరో ఈ గ్రామంలో ఉన్నప్పటికీ ఊళ్ళో మంచినీటి చెరువు కావాలని ఎంతో కాలంగా ప్రజలు వేడుకుంటున్నా చెరువుకు మోక్షం కలగలేదని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. 40 ఏళ్ల క్రితం నిరుపేదలకు నివేశన స్థలాలు ఇచ్చిన తన్నీరు సీతారామ కాలనీకి కనీస సౌకర్యాలు లేవని గ్రామస్తులు తెలిపారన్నారు. ప్రజా చైతన్య యాత్రలో కొండయ్య, శరత్, కే నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలి

సీపీఎం బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్

భట్టిప్రోలు: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ తెలిపారు. శుక్రవారం భట్టిప్రోలు పార్టీ కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ క్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం బృందం వివిధ ప్రాంతాలలో పర్యటించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి జి.సుధాకర్, కమిటీ సభ్యులు మురుగుడు సత్యన్నారాయణ, పి.మనోజ్ కుమార్, దీపాల సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమోహన్ పక్కన కమిటీ సభ్యులు

మార్క్సిస్టు సిద్ధాంతవేత్త కార్ల్‌మార్క్స్

న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల

బాపట్ల: మార్క్సిస్టు సిద్ధాంతవేత్త కార్ల్‌మార్క్స్ కౌలు, సన్న, చిన్నకార రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కోసం కృషి చేశారని న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ పేర్కొన్నారు. కార్ల్‌మార్క్స్ వర్ధంతి సందర్భంగా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేకల ప్రసాద్ మాట్లాడారు. ప్రపంచ శ్రామిక వర్గపక్షపాతి విప్లవ ఉద్యమాన్ని చేపట్టారని గుర్తు చేసుకున్నారు. 158 సంవత్సరాల క్రితం క్యాపిటల్ మొదటి రచన పూర్తి చేసి కష్టజీవులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సరుకులు అమ్మే పనిలో ప్రపంచీకరణ మార్కెట్ యువతీయువకుల శ్రమని ఏవిధంగా దోచుకుంటున్నారో పట్టి చూపిన మేధావి కార్ల్‌మార్క్స్ మాత్రమేనని చెప్పారు. తొలుత ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం బాపట్ల మండల నాయకులు పోలమ్మ, ప్రగతి శీల మహిళా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు కల్పన, లక్ష్మీ, హఫీజ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


కార్ల్‌మార్క్స్ వర్ధంతి సందర్భంగా ప్రదర్శన చేపట్టిన నాయకులు

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామ సచివాలయాలలో, పంచాయతీలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, విద్యార్థుల వసతి గృహాలలో ఈ నెల 15వ తేదీ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. పర్యావరణానికి హానిచేస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందని చెప్పారు. భూమిలో కలసిపోయే వస్తువులనే వినియోగించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి అధికారులు స్వచ్ఛాంధ్ర వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఆదేశించారు. హౌసింగ్ ఏఈ సాహితీ, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీదేవి జన్మదిన వేడుకలు



రేపల్లె రూరల్: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి మహాలక్ష్మీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక వేడుకలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు లలితా, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు వివిధ భక్తి గీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా హోలీ వేడుకలు



రేపల్లె రూరల్: చెడుపై మంచి విజయం సాధిస్తుందనటానికి చిహ్నంగా, హోలిక అనే రాక్షసిని నారాయణుడు హతమార్చటంతో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా జరుపుకునే హోలీ పండుగను శుక్రవారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువత, మహిళలు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దీంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల




చింతాయపాలెం (కర్లపాలెం): శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వారి తిరునాళ్ల శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. చింతాయపాలెం పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయంలో తిరునాళ్ల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాంతి హోమం నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, విశేష పూజలు చేశారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పూలు, పండ్లు సమర్పించి పసుపు కుంకుమలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు భక్తులను ఆకర్షించాయి.

ప్రత్యేక అలంకారంలో అమ్మవార్లు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో ముగ్గురు తల్లులైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలైన అమ్మవార్లను భక్తులు సందర్శించారు. వేద బ్రాహ్మణులు క్రోవి రామకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

నాటక ప్రదర్శన



భట్టిప్రోలు: ప్రతి ఏటా భట్టిప్రోలు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ప్రాంగణంలో గుంటూరు వారిచే భేతా వెంకట్రావు నాటక కళామందిర్ శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పూర్తి నాటకము, మండలంలోని పెదపులివర్రు శ్రీ భూ నీలా సమేత వరదరాజస్వామి దంపతుల ప్రాంగణంలో పొన్నూరు వారిచే విఘ్నేశ్వర నాట్య మండలి సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకము ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా భట్టిప్రోలుకు చెందిన ఉక్కదాల ఆనంద్ రూ.10 వేలు అందచేశారు. కార్యనిర్వహణాధికారులు శనగవరపు కుమార్ బాబు, ఇ.సాంబశివరావులు పర్యవేక్షించారు.

వైభవంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

బాపట్ల: అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను బాపట్ల పట్టణ సోమేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో గురుస్వామి కొటికం సుబ్బారావు మాట్లాడుతూ హరిహర సుతుడు అయ్యప్ప స్వామి జన్మదినాన్ని జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. గురుస్వాములు బాబు నాగేంద్ర, సుబ్బారావు, మల్లెల కోటేశ్వరరావు, మోహనరావు, శంకర్, పరమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, మోర్ల సముద్రాల గురుస్వాములను సత్కారించారు. కార్యక్రమాన్నికి సహకరించిన కోలాటం పద్మను కూడా సత్కరించారు.

కొనసాగుతున్న పునః ప్రతిష్టా మహోత్సవాలు

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండల క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన గొరిగపూడి భ్రమరి దుర్గాదేవి సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో జీవధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం జరిగాయి. ఈ నెల 16వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గొరిగపూడి గర్గపురిగా గ్రామ దేవత దేశమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో ఫణికుమార్ ఆధ్వర్యంలో పూర్వ గ్రామ కరణం, పులిగడ్డ వారి వంశస్తుల సహాయ సహకారాలతో బ్రహ్మశ్రీ సృజన్ కుమార్ ఆధ్వర్యంలో ఆచార్య అర్చక పర్యవేక్షణలో పూజలు జరుగుతున్నాయి. సర్పంచ్ గరిగపాటి మల్లికావెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఆమంచి సృజన్ కుమార్, కార్యనిర్వహణాధికారి పాపని రాజేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఉదయం మండప దేవతా పూజలు, మూల విరాట్‌లకు జలాభిషేకం, అనుష్టానములతో పాటు సాయంత్రం మండప దేవతా పూజలు, వీరభద్ర విన్యాసాలతో బలి కార్యక్రమాలు జరిగాయి.

రామలింగేశ్వరుని దివ్య కల్యాణ మహోత్సవం



చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నిత్య హోమం బలిహరణ, వసంతోత్సవం, చూర్ణోత్సవం అవబృద స్నానం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. రాత్రి కీలు గుర్రం సేవ, ధ్వజ అవరోహణ ద్వాదశ ప్రదక్షిలు, పవళింపు సేవలు నిర్వహించినట్లు కార్యనిర్వహణాధికారి అశోక్ రెడ్డి తెలిపారు. చిన పరిమి గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి 14 వరకు దివ్య కల్యాణ మహోత్సవం కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



రేపల్లె రూరల్: జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని 18వ వార్డు జగనన్న కాలనీలో శుక్రవారం సాయంత్రం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు లేవని, వర్షం పడితే వారి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని పేర్కొన్నారు. వీధి లైట్లు లేకపోవటంతో రాత్రి సమయంలో పాదచారులు, వాహన చోదకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. పాలకులు, అధికారులు స్పందించి కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కే ఆశీర్వాదం, రమేష్, అగస్టీన్, డి.శ్రీనివాసరావు, నాంచారమ్మ, పిచ్చయ్య పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వార్లకు బిందె తీర్థం, నిత్యహోమం, బలిహరణ నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన వసంతోత్సవంలో ఆబాలగోపాలం ఒకరికొకరు రంగులు పూసుకుని కేరింతలు కొట్టారు. రాత్రి సహస్ర దీపోత్సవం జరిగింది. హైమశ్రీ గోపాల నాట్య మండలి ఆర్గనైజర్ దీవి రామ్మోహన్ (పేటేరు) వారిచే ''దేవ నర్తకి'' హాస్య నాటకం ప్రదర్శించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో సమారాధన నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి, రేపల్లె ఇన్‌స్పెక్టర్ శనగవరపు కుమార్ బాబు, వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు పర్యవేక్షించారు.

వెల్లటూరులో...

హోలీ పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఎస్టీ కాలనీలో ఒకరికి ఒకరు రంగులు పూసుకుని నృత్యాలు చేశారు. పండుగను ఉల్లాసంగా ఉత్సాహంగా తెలిపారు. ఆబాల గోపాలం హోలీలో తలమునకలయ్యారు. వెల్లటూరు ఎస్టీ కాలనీలో చిన్నారులు హోలీ పండుగను జరుపుకున్నారు.